



సముద్రంలో అలవోకగా..



కాకినాడ తీరంలో విజయకేతనం చూపిస్తున్న స్విమ్మర్ శ్యామల

- వైజాగ్ నుంచి కాకినాడకు ఈదుకుంటూ.. 6
- అవలీలగా ఆరు రోజుల్లో 150 కిలోమీటర్ల ఈత
- దేశంలోనే తొలి మహిళా స్విమ్మర్‌గా రికార్డు
- స్విమ్మర్ శ్యామలకు కాకినాడలో ఘనస్వాగతం

రేపే 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీ

- కాకినాడ పీఆర్ కాలేజీ ఎదురుగా మెక్లారిన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

కాకినాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ ఆదివారం జరగనుంది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ ఆధ్వర్యంలో గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారిపర్‌ఫెక్ట్ .. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) నేతృత్వంలో జరుగుతాయి. ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఎమ్మెల్సీ(నామినేటెడ్) కర్రి పద్మశ్రీ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. కాకినాడ పీఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న మెక్లారిన్ హైస్కూల్ మైదానంలో పోటీలు ఉదయం పదిగంటలనుంచి ప్రారంభమవుతాయి. పోటీలో పాల్గొనే మహిళలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు ఇవ్వనున్నారు. పోటీలో పాల్గొనే మహిళలకు కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు. పోటీలకు అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ హాజరుకానున్నారు. ముఖ్యఅతిథులుగా ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన రానున్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ ముత్యాల ముగ్గుల పోటీకి మహిళలు అధికసంఖ్యలో నేరుగా హాజరుకావచ్చు. ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలి. చుక్కల ము గ్గుకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది.

ఇంటర్‌కూ ఇక.. మధ్యాహ్న భోజనం



- నేటి నుంచి అమలు
- విద్యార్థులకు క్యారేజీల భారం తప్పినట్లే
- జిల్లాలో 17 కళాశాలల్లో 10వేలమంది విద్యార్థులకు భోజనం

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

ఇంటర్ విద్యార్థులకు ఇక మధ్యాహ్న భోజనం పథకం అమలు కానుంది. ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకునే భారం తప్పుతుంది. శనివారంనుంచి ఈ పథకం అమలు కానున్న నేపథ్యంలో ఇంటర్ విద్యాశాఖ, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టరేట్ అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ ఆధీనంలో ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఎక్కువమంది పేద, మధ్య తరగతి, బలహీన, అట్టడుగు వర్గాలకు చెందిన వారే ఉంటున్నారు. వీరు కొన్నిసార్లు క్యారియర్లు తెచ్చుకోకుండానే కళాశాలకు రావడం, ఆకలి బాధతోనే తరగతి గదుల్లో ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. 2014-19 సంవత్సరాల మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లోని ఇంటర్‌విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. ఇది పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఈ పథకం అవసరం లేదంటూ అటకెక్కించింది.

లోకేశ్ దృష్టికి ఇబ్బందులు

మధ్యాహ్న భోజన పథకం అమలులో లేక తాముపడుతున్న ఇబ్బందుల గురించి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నారా లోకేశ్ నిర్వహించిన పాదయాత్ర సమయంలో ఇంటర్ విద్యార్థులు ఆయనను కలిసి వివరించారు. పథకాన్ని పునరుద్ధరిస్తే తమకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన లోకేశ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామనిప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అమలుపై కమిటీ వేసి దాని నివేదిక ఆధారంగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వర్తింపచేస్తూ ఆదేశాలు జారీ చేయించారు. నిధులు విడుదల చేస్తూ జీవో జారీ అయింది.

జిల్లాలో అమలు ఇలా

జిలాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 3 ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 10వేల మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వీరికి ఉన్నత పాఠశాలలో అందించే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నారు. ప్రస్తుతం పాఠశాలలకు అందిస్తున్న ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకే భోజనాన్ని అందించే బాధ్యత అప్పగించారు.

ఎగిరేది ఎక్కడికో?


మెట్టప్రాంతంలో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదించిన భూమి

- తుని-అన్నవరం మధ్య విమానాశ్రయం భవితవ్యమేంటో
- తొండంగి మండలంలో 787 ఎకరాలు ప్రతిపాదించిన అధికారులు
- ఎయిర్‌పోర్టుకు భూములు తీసుకుంటే కుదరదంటూ అన్నదాతల ఆందోళనలు
- ఇక్కడే రైల్వేలైన్, హైవే, పోలవరం, పుష్కర, చెరువులున్నాయని సీఎంకు నివేదిక
- ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఏఏఐ త్వరలో అధ్యయనం
- ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఓకే అంటే నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- సాధ్యం కాకపోతే అనకాపల్లి-కాకినాడకు సమీపంలో నిర్మించే అవకాశం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

తొండంగి మండలం పరిధిలోని తుని- అన్నవరం మధ్య కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై అస్పష్టత కొనసాగుతోంది. ఇక్కడ విమానాశ్రయం నిర్మించడానికి అధికారులు ప్రభుత్వానికి సానుకూల నివేదికలు పంపారు. అయితే ప్రతిపాదించిన భూముల్లో హైవే, రైల్వేలైన్, భారీ చెరువులుండడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు ఈప్రాంతంలో ఎయిర్‌పోర్టు సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) తీసుకోనున్న నిర్ణయం అత్యంత కీలకం కానుంది. త్వరలో అధ్యయనం చేయడం ద్వారా విమానాశ్రయం నిర్మాణానికి పచ్చజెండా లభిస్తుందా?లేదా? అనేది తేలనుంది. దీనిపై సీఎం చంద్రబాబు శుక్రవారం అమరావతిలో సమీక్ష నిర్వహించారు. అధికారులు సైతం ప్రతిపాదిత భూముల్లో ఉన్న అవాంతరాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఏఏఐ నివేదిక ఎయిర్‌పోర్టు భవితవ్యాన్ని తేల్చనుంది. ఒకవేళ సాధ్యమని తేల్చితే ఇక్కడే ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించనుంది. కాదంటే ప్రత్యామ్నాయం ఎక్కడనే చర్చ జరుగుతోంది. అటు అనకాపల్లి-కాకినాడ మధ్యలో అనువైన ప్రాంతంలో దీన్ని నిర్మించాలని సీఎం సమక్షంలో జరిగిన సమీక్షలో చర్చకు వచ్చింది.

ఉంటుందా..లేదా..

రాష్ట్రంలో కొత్తగా విమానాశ్రయాలు నిర్మించి తద్వారా పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించాలని భావిస్తోంది. అందుకోసం పరిశ్రమలకు సమీపంలో కొత్త ఎయిర్‌పోర్టులు కట్టాలని ప్రణాళికలు రచిస్తోంది. అందులోభాగంగా కాకినాడసెజ్, అందులో నిర్మాణమవుతున్న కొత్త పోర్టు, అలాగే అనేక ఫార్మా కంపెనీలున్న ప్రాంతానికి సమీపంగా తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని ఓ అంచనాకు వచ్చింది. దీంతో అధికారులు కొంతకాలం కిందట తుని-అన్నవరం మధ్య తొండంగి మండలం పరిధిలోని చిన్నయ్యపాలెం, బెండపూడి గ్రామాల పరిధిలో 787ఎకరాల భూములు అయితే బాగుంటుందని ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో బెండపూడి గ్రామంలో 490 ఎకరాలు ప్రైవేటు, 28ఎకరాలు ప్రభుత్వానికి ఉన్నట్లు తేల్చారు. అలాగే పీఈ చిన్నయ్యపాలెం గ్రామంలో 266 ఎకరాలు రైతులవి, 1.75ఎకరాలు ప్రభుత్వానికి ఉన్నట్లు గుర్తించారు. ఈభూములు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పరిశీలించవచ్చని సూచించారు. దీనిపై ఇటీవల పూర్తి నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపించి అందులో కొన్ని సందేహాలు వ్యక్తం చేశారు. ప్రతిపాదిత భూములు అన్నవరం రైల్వే లైను, జాతీయ రహదారికి మధ్యలో ఉన్నాయని నివేదికలో వివరించారు. పైగా ఈభూములకు ఆనుకుని 88 ఎకరాల్లో భారీ చెరువుఉందని పేర్కొన్నారు. దీంతోపాటు ఈభూములకు దగ్గర్లో పోలవరం, పుష్కర ప్రాజెక్టుల కాలువలు పయనిస్తు న్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రతికూలతలను అధిగమించి ఎయిర్‌పోర్టు నిర్మించవచ్చా.. లేదా అనేది ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తేల్చాలని పేర్కొన్నారు. ఇదే విషయమై సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు శుక్రవారం చర్చించారు. ప్రాథమికంగా సూచించిన ఈభూముల్లో కొన్ని ప్రతికూలతలున్న విషయమై సమీక్షించారు. ఈనేపథ్యంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మించే సాధ్యాసాధ్యాలపై త్వరలో ఏఏఐ సర్వే చేసి ఇచ్చే నివేదిక అత్యంత కీలకంగా మారనుంది. అయితే ఇప్పటివరకు ఏఏఐ నుంచి సర్వేకు సంబంధించి సాధ్యాసాధ్యాల పరిశీలన కూడా మొదలవలేదు. కానీ సర్వేకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఇక్కడ విమానాశ్రయం భవితవ్యం ఏంటనేది తేలాల్సి ఉంది. మరోపక్క గుర్తించిన 787 ఎకరాలు పూర్తిగా ప్రైవేటు భూములు. ఎయిర్‌పోర్టుకు వీటిని ఇచ్చేది లేదని అన్నదాతలు కొంతకాలంగా ఆందోళనలుచేస్తున్నారు. కలిసికట్టుగా పోరాటం కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు పరిస్థితి ఏంటనేది తేలడానికి సమయం పట్టనుంది.

ఇక్కడ కాకుంటే ఇంకెక్కడ...

మరోపక్క సీఎం సమక్షంలో జరిగిన సమీక్షలో అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి ప్రస్తావన వచ్చింది. ప్రస్తుతం నక్కపల్లి ఫార్మాహబ్‌గా పేరొందింది. అటు ఎన్టీపీసీ పవర్ ప్లాంట్, మిట్టల్ స్టీల్‌ప్లాంట్ తదితర కంపెనీలు భారీస్థాయిలో రాబోతున్నాయి. దీంతో ఇక్కడ కూడా విమానాశ్రయం అవసరం అని సీఎం పేర్కొన్నారు. కానీ ఇక్కడ గుర్తించిన 4,500ఎకరాలు మిట్టల్ కంపెనీకే సరిపోవు. దీంతో విమానాశ్రయం ఏర్పాటుకు అసలు ఇక్కడ భూములే లేవు.అటు తుని-అన్నవరం మధ్య ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టుకు నక్కపల్లికి మధ్య 38కిలోమీటర్లే దూరం. ఈనేపథ్యంలో నక్కపల్లిలో ఉన్న ప్రతికూలతల నేపథ్యంలో వేరేదారి లేక తుని-అన్నవరం మధ్యనే విమానాశ్రయం ఏర్పా టుకు ఏఏఐ మొగ్గుచూపుతుందా? అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ కాదంటే నక్కపల్లి-కాకినాడ మధ్య ఇంకో అనువైన ప్రాంతం ఏదైనా గుర్తించే అవకాశం కూడా లేకపోలేదు. కానీ అనువైన భూముల లభ్యతే సమస్యగా మారనుంది.

పిఠాపురంలో జనసేన ప్లీనరీ

- మార్చి 12,13,14వ తేదీల్లో నిర్వహణ
- కోర్‌కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చ

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం జనసేన ప్లీనరీ సమావేశాలకు వేదిక కానుంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ సమావేశాల్లో పార్టీకి సంబంధించి కీలక అంశాలపై తీర్మానాలతోపాటు డెలిగేట్స్ సదస్సు, చర్చాగోష్టులు ఉంటాయి. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 12, 13, 14వ తేదీల్లో పిఠాపురం నియోజకవర్గంలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నారు. మూడురోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో 12వ తేదీ ప్లీనరీ ప్రారంభోత్సవం, డెలిగేట్స్‌తో సమావేశం, వివిధ అంశాలపై చర్చా గోష్ఠులు, చివరి రోజు 14న బహిరంగసభ ఉంటాయి.

పిఠాపురంలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఏర్పాట్లు, ఇతర అంశాలపై విజయవాడలో జనసేన పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. పార్టీ సిద్ధాంతాలు, పవన్‌కల్యాణ్ ఆశయాలు, ఎలా ముందుకు సాగాలన్న అంశంపై ప్లీనరీలో చర్చలు సాగాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. పిఠాపురంలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించడంతో అనువైన ప్రాంతాల ఎంపికపై చర్చ మొదలైంది. పిఠాపురం పట్టణ శివారులో 216వ హైవే చెంతనే పవన్‌కల్యాణ్ కొనుగోలు చేసిన స్థలంలో సమావేశాలు నిర్వహించొచ్చని భావిస్తున్నారు.

వచ్చే వారంలో పవన్ పర్యటన

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వచ్చే వారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 10 లేదా 11వ తేదీల్లో ఆయన కాకినాడతోపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారని జిల్లా అధికారులకు సమాచారం అందింది. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతోపాటు ప్రస్తుతం జరుగుతున్న వివిధ పనులను పవన్ పరిశీలిస్తారని చెబుతున్నారు. ఇందులో భాగంగానే డిప్యూటీ సీఎం పేషీ అధికారులు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

కాకినాడలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం 7


కాకినాడలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, సివిల్ సప్లైస్ చైర్మన్ తోట సుధీర్

మత్స్యకారులకు నష్టపరిహారం అందజేత 7

గుంతల రోడ్లు లేని రాష్ట్రంగా.. సంక్రాంతి నాటికి సిద్ధం


బహిరంగసభలో ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- గిడ్డంగుల సంస్థ గోదాముల ప్రారంభం

సామర్లకోట, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.1,200కోట్లతో గుంతలు పడిన రోడ్లన్నీ రానున్న సంక్రాంతి పండుగ నాటికి చక్కదిద్దే పనులు చురుగ్గా జరుగుతున్నాయని, ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ.5వేల కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరందుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, సహకార మార్కెటింగ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. సామర్లకోట పట్టణ పరిధిలో రూ.10.31కోట్ల నిధులతో గిడ్డంగుల సంస్థ నిర్మించిన గోదాములను పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్పతోకలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చినరాజప్ప అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలకు 20లక్షల మెట్రిక్‌టన్నుల సామర్థ్యంగల గిడ్డంగులు అవసరమన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తన నియోజకవర్గంలో రైతులకోసం నూతన గిడ్డంగులు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, కుడా చైర్మన్ తుమ్మల బాబు, గిడ్డంగుల సంస్థ వైస్‌చైర్మన్ జి.సురేష్‌కుమార్, పేరాబత్తుల రాజశేఖర్, రాజా సూరిబాబురాజు పాల్గొన్నారు.

జిల్లాలో గిడ్డంగులు

జిల్లాలో సామర్లకోట, గొల్లప్రోలు, కిర్లంపూడి, నడకుదురు ప్రాంతాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ సొంతంగా 62 వేల మెట్రిక్ టన్నుల పరిమాణంగల సొంత గోదాములు కల్గిఉన్నామని రీజనల్ చైర్మన్ భానుమూర్తి వెల్లడించారు. సామర్లకోటలో 3.94 ఎకరాల విస్తీర్ణంలో రూ.10.03కోట్లతో నిర్మించిన గిడ్డంగుల సంస్థ గోదాములు ప్రారంభించారు.





ఆర్గానిక్‌లో అద్భుతాలు..

ప్రకృతి వ్యవసాయంలో సాగుపోతున్న రాంబాబు

క్రిమి సంహారక ఎరువులు, పురుగు మందుల మధ్య పుట్టుకొస్తున్న 'ఆహారం' అనారోగ్యాన్ని తెచ్చిపెడుతోంది. మందులు చల్లిన ఆహార ఉత్పత్తులకు అలవాటు పడ్డ మనిషి కొత్త కొత్త రోగాలను కొనితెచ్చుకుంటున్నాడు. ప్రస్తుతం అంతా స్పీడ్ సాగు..దీంతో అంతే స్పీడుతో ఆరోగ్య సమస్యలు కూడా వచ్చి పడుతున్నాయి. విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీతో అధిక దిగుబడులు సాధించడం తప్ప, నాణ్యమైన దిగుబడులు మాత్రం సాధించలేకపోతున్నారు. అయితే యువ రైతు ప్రగడ రాంబాబు ఆ రూటు ఎంచుకోలేదు..ప్రకృతి వ్యవసాయమే ఊపిరిగా సాగుతున్నాడు.

● రాజానగరం/(ఆంధ్రజ్యోతి)

- ప్రకృతి వ్యవసాయ సాగులో ఆరితేరిన యువ రైతు ప్రగడ రాంబాబు
- క్లావ్ బీన్స్ సాగు భలే బాగు
- మిశ్రమ కూరగాయల సాగులో మేటిగా రాణింపు
- 'మార్కెటింగ్' తెలిసిన రైతుగా పేరు


పొట్టి పొట్ల కాయలు

ప్రకృతి సాగే ఊపిరిగా..

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన రాంబాబు దశాబ్ద కాలంగా ప్రకృతి వ్యవసాయ సాగులో ఆరితేరాడు.. ఆర్గానిక్ సాగు విధానంలో అనేక రకాలైన కూరగాయలతో పాటు వరి పంటను పండిస్తూ వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. గ్రామంలో గత పదేళ్లగా నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రాంబాబు 'పంట' ప్రయోగాలు చేస్తున్నాడు. ప్రకృతి సాగు విధానంలో మిశ్రమ కూరగాయల సాగులో రాణిస్తున్నాడు. తేలికపాటి నేలల్లో లవంగ, చిక్కుడు సాగు భలే బాగుంటుందని నిరూపిస్తున్నాడు.


లవంగ చిక్కుడు ఎగుమతికి సిద్ధం

శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

యువ రైతు రాంబాబు చేసే ప్రకృతి సాగు వ్యవసాయ విధానాన్ని అనేక రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు అనేక పర్యాయాలు క్షేత్ర సందర్శన చేశారు. చత్తీస్‌గడ్‌కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన 25 మంది రైతుల బృందం క్షేత్ర సందర్శన చేసింది. అలాగే మహారాష్ట్ర నుంచి వ్యవసాయాధికారులు అక్కడి రైతులతో కలిసి సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలోని వ్యవసాయాధికారులు, రైతులు అనేక పర్యాయాలు పర్యటించారు.


యువ రైతు రాంబాబు

ప్రభుత్వం సహకరించాలి

ప్రకృతి వ్యవసాయంలో మార్కెటింగ్ సమస్య రైతులను వెంటాడుతోంది. ఖర్చులు ఎక్కువ, దిగుబడి తక్కువ. ప్రభుత్వం మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలి. లేదంటే నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేయాలి, లేనిపక్షంలో కనీసం హబ్‌లు ఏర్పాటు చేయాలి. సాగు విధానంలో మార్కెటింగ్ సదుపాయాలు తక్కువ, ఖర్చులు ఎక్కువ ఉంటున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో సుభాష్ పాలేకర్ విధానంతో పాటుగా సొహేన్‌క్యూ, సీవీఆర్, సస్యరక్షణ శిలీంద్ర విధానాలను అవలంభిస్తున్నట్లు రాంబాబు వివరించాడు..

క్లావ్ బీన్స్ (లవంగ చిక్కుడు)..

క్లావ్ బీన్స్ అనేది తీగ జాతికి చెందిన పాలు కారే మొక్క విత్తనాలు కేరళ నుంచి కిలో రూ.2 వేలు వంతున కొనుగోలు చేశారు. విత్తనం నాటిన 5 రోజులకు మొక్కలు పుట్టుకొచ్చి, 50 రోజులకు కాపు దశకు చేరుకుంటుంది. ఆకులు తమల పాకులను పోలి, పూలు తూటి పువ్వులు మాదిరిగా ఉంటాయి. ప్రస్తుతం రెండు ఎకరాల్లో క్లావ్ బీన్స్ సాగులో ఉంది. ప్రస్తుతం కిలో రూ.100 వరకు ధర ఉంది.

క్లావ్ బీన్స్ గుణగణాలు

క్లావ్ బీన్స్ పూర్తి శీతాకాల పంట. సాగులో తెగుళ్లు, చీడ పీడలను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుంది. అలాగే నిల్వ సామర్థ్యం కూడా దీని సొంతం. వర్షాకాలంలో వచ్చే ఆకాకర సాగు తర్వాత క్లావ్ బీన్స్ పూర్తి శీతాకాలపు సాగుగా చెప్పొచ్చు. క్లావ్ బీన్స్‌లో పోషకాలు కూడా పుష్కలంగా ఉంటాయి.

వివిధ రకాల సాగు

రాంబాబు తన నాలుగు ఎకరాల పొలంలో స్నేక్ గార్డ్ (పిచ్చుక పొట్ల కాయ), గ్రీన్ సొరకాయ, చిత్రాడ బీర, కూర దోస, గ్రీన్ పిచ్చుక పొట్లకాయ, గ్రీన్ దేశవాళి కీరదోస, వైట్ దేశవాళి కీరదోస, దేశవాళి పొడవు కీర, ఆనబకాయ, బొబ్బర్లు (లాంగ్ వెరైటీ), బీర, దొండ, కాకర, మిర్చి తదితర పంటను సాగు చేశాడు. ప్రస్తుతం క్లావ్ బీన్స్ (లవంగ చిక్కుడు)తో పాటుగా తమ్మ చిక్కుడు, కూర బొబ్బర్లు (పొడవు), వెల్‌వెట్ బీన్స్, మామిడి అల్లం, పసుపు, దొండ, బొప్పాయి, మిర్చి, టమాట వంటి రకాలు సాగులో ఉన్నాయి. ఏడాది కాలంలో మూడు పంటలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని మార్చి నెలలో శ్రీకారం చుట్టి ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తాడు. ప్రతి రెండేళ్లకోసారి పంట మార్పిడిలో వరి, మినుము, పచ్చిరొట్ట ఎరువులు సాగు చేస్తాడు. వీటిలో ప్రధానంగా రెండు పంటలు కూరగాయలు సాగు ఉంటుందని అతను చెబుతున్నాడు..

సముద్రంలో అలవోకగా..

- వైజాగ్ నుంచి కాకినాడకు ఈదుకుంటూ..
- అవలీలగా ఆరు రోజుల్లో 150 కిలోమీటర్ల ఈత
- దేశంలోనే తొలి మహిళా స్విమ్మర్‌గా రికార్డు
- మహిళా స్విమ్మర్ గోలి శ్యామలకు ఘనస్వాగతం


సముద్రంలో జాతీయ పతాకంతో స్విమ్మర్ శ్యామల

సర్పవరంజంక్షన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సువిశాల సముద్రం.. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలు. సముద్రంలో జెల్లీ ఫిష్‌లు వెంటపడి కొరుకుతున్నా.. భయంకరమైన వేల్ ఫిష్ దాడికి ప్రయత్నించినా సప్త సముద్రం, బంగాళాఖాతంలో 150కిలోమీటర్ల మేర సముద్రంలో ఈత లక్ష్యాన్ని పూర్తిచేయాలన్న సంకల్పం ముందు అవరోధాలు ఏమీ కానరాలేదు. కేవలం 6 రోజుల్లో రోజుకు 20-30కిలోమీటర్లు సముద్రంలో ఈత కొట్టి వైజాగ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు సముద్రంలో 150 కిలోమీటర్ల లక్ష్యాన్ని అవలీలగా ఈదేసి అరుదైన రికార్డును సొంతంచేసుకున్నారామె. ఆమె కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన 52ఏళ్ల మహిళా స్విమ్మర్ గోలి శ్యామల.

యానిమేషన్ సినిమాల నిర్మాత, దర్శకురాలిగా, రచయితగా, పలు బిజినెస్‌లు చేసి నష్టపోయి డిప్రెషన్‌కు లోనై కోమాలోకి కూడా వెళ్లిన ఆమె ఇప్పుడు అంతర్జాతీయ వాటర్ స్విమ్మర్‌గా రికార్డులను తనపేరున లిఖించుకున్నారు.మహిళల ఆరోగ్య, మానసిక సమస్యలనుంచి ఆరోగ్యంగా ఉండేలా, పర్యాటకరంగం అభివృద్ధి కోసం శ్యామల విశాఖ ఆర్కే బీచ్ నుంచి కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌వరకు 150కిలోమీటర్లు సముద్రంలో ఈత ఈది రికార్డు సృష్టించాలని నిర్ణయించుకుంది. డిసెంబరు 28న విశాఖ ఆర్కే బీచ్‌లో ఎంపీ భరత్ సముద్రంలో సాహస యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు. విశాఖతీరంనుంచి సముద్రంలో ఈత ఈదుకుంటూ శుక్రవారం జనవరి 3న కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు అవలీలగా లక్ష్యాన్ని చేరుకున్నారు. సుదీర్ఘ సముద్రంలో 150కిలోమీటర్లు ఈత ఈదిన తొలి ఆసియా స్విమ్మర్‌గా శ్యామల అరుదైన రికార్డు సాధించారు. ఎన్టీఆర్ బీచ్‌కు చేరుకున్న ఆమెకు కోరమండల్ ఒడిస్సీ ఓషియన్ స్విమ్మింగ్, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన ఘన స్వాగతం పలికారు.

మహిళల్లో చైతన్యం.. ఆరోగ్య సంరక్షణకు..

అభినందనసభలో మహిళా స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం ఆరోగ్య సంరక్షణ, పర్యాటక రంగం అభివృద్ధికి సముద్రంలో ఈతను నేర్చుకున్నామన్నారు. శ్రీలంకనుంచి రామసేతు వరకు, లక్షద్వీప్ సముద్రంలో ఈతఈది పలు రికార్డులు సాధించానన్నారు. అమెరికాలో జరిగిన ఈత పోటీల్లో 36కిలోమీటర్ల కాటలినా ఛానల్‌ని ఈదానన్నారు. ఓ ఆంగ్ల పత్రికలో ఇంగ్లీష్ ఛానల్ ఈదిన వ్యక్తి కథనం ఈత వైపు వెళ్లేలా చేసిందని, లక్షద్వీప్‌లో జరిగిన పర్యాటక అభివృద్ధిలో పాల్గొనేందుకు విచ్చేసిన ప్రధాని మోదీ చేసిన ప్రచారం నాలో స్ఫూర్తిని నింపిందన్నారు. లక్ష్యసాధనకు కృషిచేయాలని, ప్రతిఒక్కరూ ఈత నేర్చుకోవడం ద్వారా తల


స్విమ్మర్ శ్యామలను అభినందిస్తున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడ కమిషనర్ భావన, కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు

వెంట్రుక నుంచి శరీరంలో ఉన్న అన్ని భాగాలకు పూర్తి వ్యాయామం చేసినట్లు అవుతుందన్నారు. ప్రపంచంలోనే నాలుగో అంతర్జాతీయ స్విమ్మర్‌గా, దేశంలో నేనే నెంబర్‌వన్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. కోచ్‌జాన్ సివిక్ పర్యవేక్షణలో హైదరాబాద్‌లో తాను జాయింట్ స్పోర్ట్స్ నేర్చుకున్నానన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు ఎదురవుతాయని, అలాంటి సమయంలో ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుందామని భావించకుండా మైండ్ డైవర్షన్ చేసుకోవడం ద్వారా ఒత్తిడినుంచి బయట పడవచ్చన్నారు. ఎమ్మెల్యే రాజప్ప, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ వైడీ రామారావు,కాకినాడ సీపోర్టు ప్రైవేట్ లిమిటెడ్ జీఎం మురళీధర్, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


పోటీల ప్రారంభవేళ పుంగనూరు ఆవుదూడతో ఎమ్మెల్యే వరప్రసాద్

కేశనపల్లిలో రాష్ట్ర స్థాయి ఆవుల అందాల పోటీలు

మలికిపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ చాలా ప్రధాన అంశమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. పశు సంపదను కాపాడుకున్ననాడే గ్రామాలు సిరిసంపదలతో విరాజిల్లుతాయన్నారు. గ్రామీణస్థాయిలో రాష్ట్రస్థాయి ఒంగోలు పాల పోటీలు, ఒంగోలు, పుంగనూరు, గిరి ఆవుల అందాల పోటీలు ఏర్పాటు చేయడం నిర్వాహకుల గొప్పదనానికి నిదర్శనమన్నారు. డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో అడబాల లక్ష్మీనారాయణ (నాని) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ రకాల జాతుల ఆవులను పరిశీలించారు. కాసేపు గుర్రంపై సవారీ చేశారు. కార్యక్రమంలో కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, సూరిశెట్టి శ్రీనివాస్, మందపాటి నాగేశ్వరరావు, గుర్లింక సత్యనారాయణ, అడబాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.





పోటీలో ఆకట్టుకున్న పలు రకాల ఆవులు


విద్యార్థినులు పరీక్ష రాస్తున్న తీరును పర్యవేక్షిస్తున్న చీఫ్ ఎగ్జామినర్, జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ

ప్రశాంతంగా జీఎన్‌ఎం పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లోని పలు నర్సింగ్ విద్యా సంస్థల్లో జీఎన్‌ఎం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా సర్వజన ఆసుపత్రి (జీటీజీహెచ్)లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంసీహెచ్ బ్లాకులోని పై అంతస్తులో కేంద్రాన్ని కేటాయించారు. జీటీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రెండు సెషన్లుగా జీఎన్‌ఎం పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చీఫ్ ఎగ్జామినర్‌గా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ఈ నెల 11వ తేదీ వరకు, తృతీయ సంవత్సరం వారికి మళ్లీ 6వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం, తృతీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం వేర్వేరుగా పరీక్షలు నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి 21 స్కూల్స్‌కు చెందిన మొత్తం 1,500వందల మందికిపైగా పరీక్షలు రాస్తున్నారు. ఉదయం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు, మధ్యాహ్నం నుంచి తృతీయ సంవత్సరం విద్యార్థినులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తొలిరోజున మొదటి సెషన్‌లో 981 మందికి 844మంది పరీక్షలకు హాజరయ్యారు. 140 మంది గైర్హాజరయ్యారు. రెండవ సెషన్‌లో 550 మందికి 25 మంది హాజరుకాలేదు. చీఫ్ ఇన్విజిలేటర్ కె.లక్ష్మి, చీఫ్ సూపర్‌వైజర్ ఆఫీసర్ ఆర్.శ్యాంసుందరరావు, ఆసుపత్రి మేనేజర్ కె.కేదారేశ్వరరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వీరుళ్లమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించేందుకు గోదావరి జలాలను తీసుకువస్తున్న మహిళలు

వీరుళ్లమ్మకు వైభవంగా హరిద్రాభిషేకం



అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మకు శుక్రవారం 1008 మంది ముత్తయిదువులు హరిద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి మహిళలు ఎర్ర కాలువ వద్దకు చేరుకుని గోదావరి జలాలను కలశాల్లో నింపుకున్నారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని జలాల్లో హరిద్రం కలిపి అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం చేశారు. హరిద్రాభిషేకంలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాంబూలం, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.


వీరుళ్లమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు హరిద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తురాలు

ఆదిత్య యూనివర్శిటీని సందర్శించిన సినీ ప్రముఖులు

గండేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీకి తెలుగు సినీ ప్రముఖులు పలువురు శుక్రవారం విచ్చేశారు. ఇంద్ర, సమరసింహారెడ్డి వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన ప్రముఖ దర్శకుడు బి.గోపాల్, మెగాస్టార్ చిరంజీవితో 25కు పైగా విజయవంతమైన చిత్రాలు తీసిన ఎ.కోదండరామిరెడ్డి, తెలుగులోనే కాకుండా కొన్ని బాలీవుడ్ సినిమాలకు పని చేసిన ఎస్.గోపాల్ రెడ్డి, ప్రముఖ సంగీత దర్శకుడు కోటి సందర్శించారు. వారందరికీ ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.


సినీ ప్రముఖులను సత్కరించిన ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్ శేషారెడ్డి

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

● మంత్రి అచ్చెన్నాయుడు ● మత్స్యకారులకు నష్టపరిహారం అందజేత

తాళ్లరేవు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తామని, ఆ వృత్తి చేస్తూ జీవనోపాధి కోల్పోయిన నష్టపోయిన రైతులకు 23,450 మందికి ఓఎన్‌జీసీ ద్వారా ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున మొత్తం రూ.148 కోట్ల37లక్షల18,500 నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యకాశాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలో ఓఎన్‌జీసీ పైపులైను వల్ల నష్టపోయిన మత్స్యకారులకు నష్టపరిహారం ఓఎన్‌జీసీ సంస్థ నుంచి అందజేశారు. శుక్రవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ బహిరంగ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసేందుకు కృషి చేస్తుందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసిపోయిందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని గాడిలోపెట్టేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నారన్నారు. మరో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి 20,878 మందికి రూ.63,250 చొప్పున రూ.132కోట్ల 5లక్షల33వేలు, పి.గన్నవరం, కొత్తపేట, మండపేట, రామచంద్రపురంలో 69మందికి సుమారుగా రూ.16 కోట్లు మొత్తం 23,458మందికి రూ.148కోట్ల 38లక్షలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలి పారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీ రుణాలు, వలలు, పనియుట్లు అం దించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1000 కిలోమీటర్లు వరకు కోస్టల్ ప్రాంతం ఉందని దీన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాదుర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరావు, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మత్స్యశాఖ కమిషనర్ టిడోలా శంఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కోరింగలో మత్స్యకారులకు నష్ట పరిహారం చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు





సభలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

మార్చి నాటికి పన్నులు వసూలు చేయాలి

కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో 6 మున్సిపాల్టీలపై రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు సమీక్ష





సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ...పాల్గొన్న కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది

కొవ్వూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మార్చి నాటికి ఆస్తి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సిహెచ్. నాగనరసింహరావు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు సమీక్షా సమావేశాలకు పూర్తి సమాచారంతో హజరుకావాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో శుక్రవారం కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 6 మున్సిపల్ కమిషనర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను, కుళాయి పన్ను, పారిశుధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరుచేయడం, ట్రేడ్ లైసెన్సులు, తాగునీటి సరఫరా, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్ వంటి అంశాలపై మున్సిపాల్టీల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం టౌన్ ప్లానింగ్, మెప్మా సిబ్బందితో సమీక్ష చేశారు. నాగనరసింహరావు మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాల వారీగా మున్సిపాల్టీల ప్రగతిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కొన్ని మున్సిపాల్టీలు సచివాలయ కార్యదర్శుల అటెండెన్స్‌లోను, పన్నుల వసూలు, కొత్త అసెస్‌మెంట్లు, ఎడిషన్ ఆల్టేషన్స్‌లో బలహీనంగా ఉన్నాయన్నారు. మున్సిపాల్టీల డేటాను కమిషనర్ చెక్ చేయకుండా ఆర్డీ కార్యాలయానికి పంపించవద్దన్నారు. మండపేట, రామచంద్రాపురం, ముమ్మిడివరం మున్సిపాల్టీలు నాన్ రెసిడెన్స్ ప్రాంతాలని, కమర్షియల్ ప్రాంతాల్లో ఆదాయం పెంచుకోవడానికి కౌన్సిల్ ఆమోదంతో గెజిట్ పబ్లికేషన్ చేసుకోవాలన్నారు. తదుపరి సమావేశానికి గెజిట్ పబ్లికేషన్ చేయకపోతే కమిషనర్లు వివరణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తను తగలబెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలు ఉదయం నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలన్నారు. ఆన్‌లైన్‌లో అటెండెన్స్ తనిఖీ చేస్తామన్నారు. జనవరి నెలాఖరులోగా మున్సిపాల్టీల్లో గుంతలు పడిన రహదారుల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని లేకుంటే మున్సిపాల్టీల నిర్వహణ, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఆస్తి పన్ను, వడ్డీ మాఫీ ఉండదన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి అందించి, సహకరించాలన్నారు. ప్రతి నెల సమీక్షా సమావేశాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, నిడదవోలు, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌లు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిఉండాలి

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

కాకినాడలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన

కాకినాడ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. కాకినాడ సాలిపేట పీఎస్‌రాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆధ్వర్యంలో దక్షిణభారత విద్యావైజ్ఞానిక ప్రదర్శన 2025కు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను శుక్రవారం జిల్లాసైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు కె.పద్మశ్రీ, ఐ.వెంకటేశ్వరరావు, కౌడా ఛైర్మన్ తమ్మల బాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ పాల్గొని వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎప్పుడూ విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను మాత్రమే తెలియజేయాలన్నారు. పద్మశ్రీ మాట్లాడుతూ మానవ మెదడే అతిపెద్ద కంప్యూటరని ఆలోచనలకు పదునుపెడితే ఏదైనా సాధించవచ్చన్నారు. సుధీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు వివిధ నూతన కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నదన్నారు. అతిథులు జ్యోతిప్రజ్వలనచేసి పోటీల లోగోను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అతిథులు పరిశీలించారు. కాకినాడ జిల్లాలోని 21 మండలాల నుంచి వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు 109 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో 36, గ్రూప్‌లో 39, ఉపాధ్యాయుల విభాగంలో 34 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డీఈవో పి.రమేష్, కాకినాడ, పెద్దాపురం డీవైఈవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌శర్మ, జీసీడీవో ఉమా మహేశ్వరి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మొదటి రెండుస్థానాల్లో నిలిచిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని డీఈవో తెలిపారు. విజేతలకు యంగ్ మైండ్స్ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ పరీక్షా అట్టలు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి పి.వేణుగోపాలరావు, ఎంఈవోలు సీహెచ్ రవి, సత్యనారాయణ, శ్రీనివాసరావు పీడీలు బంగారాజు, రవిరాజు, రంగారావు పాల్గొన్నారు.





మానవ అస్థిపంజరం, ఐడీ కార్డు చెకింగ్ స్కానర్ ప్రదర్శనలు

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా మహిళా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు నాలుగో రోజైన శుక్రవారం ప్రత్యేకంగా మహిళలకు కేటాయించారు. మొత్తం 295మంది హాజరు కాగా తదుపరి పరీక్షకు 180మంది అర్హత సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థినులకు నిర్వహించిన పరీక్షలను జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.

కత్తితో బెదిరించి..

గోల్డ్ చైన్ చోరీ చేసిన ఇద్దరి అరెస్టు

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కత్తితో చంపుతానని బెదిరించి బంగారు చైన్, నగదు చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. పిఠాపురం మండలం నరసింగపురానికి చెందిన బొలిశెట్టి వెంకటరమణ, లక్ష్మీ పిఠాపురంలోని పూర్ణా, అన్నపూర్ణా థియేటర్ వద్ద నడిచి వెళ్తుండగా ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు బైక్‌పై వచ్చి వారిని కత్తితో పొడిచి చంపుతామని బెదిరించి బంగారు గొలుసు, రూ.500 చోరీ చేసి పరారయ్యారు. ఎస్ఐ, సర్కిల్ క్రైమ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ జరిపి చోరీకి పాల్పడిన పిఠాపురం రథాలపేటకు చెందిన పూడి గంగాధర్, మంగితుర్తి గ్రామానికి చెందిన డెక్కల ఆనంద్‌ను అరెస్టు చేసి వారి నుంచి బంగారు చైన్, బైక్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

సరదాగా ఈతకు దిగి

గోదావరిలో యువకుడు గల్లంతు



గల్లంతైన వీరమణికంఠ (ఫైల్ ఫొటో)

ముమ్మిడివరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సరదాగా గోదావరిలో ఈతకు దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొత్తలంకకు చెందిన ముగ్గురు యువకులు సరదాగా కేశనకుర్రు గోదావరి పాయ చెంతకు వెళ్లారు. వారిలో మంగ విజయవీరమణికంఠ (19) కొద్దిగా ఈత రావడంతో గోదావరిలో దిగాడు. స్నేహితులు మంగ జశ్వంత్, పొత్తూరి పార్థసారధిలకు ఈత రాకపోవడంతో వారు ఒడ్డునే ఉన్నారు. మణికంఠ గోదావరిలో దిగా కొంతదూరం ఈదినా తరువాత ఉక్కిరిబిక్కిరి కావడంతో గోదావరిలో మునికి గల్లంతయ్యాడు. వారు ముగ్గురు ఓడలరేవు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కొత్లంలకకు చెంది మంగ నాగేశ్వరరావు-మహలక్ష్మి దంపతులకు లక్ష్మీన వీనసాయిశ్రీ కుమార్తెలు ఉండగా, విజయవీరమణికంఠ ఆఖిరి సంతానం. ఒక్కగానొక్క కుమారుడు గోదావరిలో గల్లంతు కావడంతో ఆ కుటుంబలోను, గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ఎస్ఐ డి.జ్వాలాసాగర్, పోలీసులు గోదావరి నదీ పాయలో గాలింపు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం వరకు మణికంఠ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్

రూ.3.42 లక్షల విలువైన 68.6 కిలోల గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం

జగ్గంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను శుక్రవారం జగ్గంపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 31న కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామం టోల్‌గేట్ వద్ద గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో అర్ధరాత్రి వేళ టోల్‌ప్లాజ్ వద్ద సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ బృందంతో కలిసి యూపీ81 బీడీ4243గల కారును ఆపగా ఆపినట్టే ఆపి ఒక్కసారిగా వేగంగా నడపడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ లోవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే కాకినాడ మెడికోవర్ ఆసుపత్రికి తరలించారు. అయితే కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆ కారులో గంజాయి ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిందితుల కోసం గాలించగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన తరుణ్‌కుమార్, జాహిద్, ముస్తాకిమ్, మహ్మద్ జాభీర్‌ఖాన్‌ను శుక్రవారం కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామం పోలవరం కాలువ వద్ద కారుతో అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఆలీఘడ్‌కు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.3.42 లక్షల విలువైన 68.6 కిలోల గంజాయి, రూ.20.5 లక్షలు విలువైన కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నింది తులను పట్టుకునేందుకు ఎంతో కృషి చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ సతీష్, క్రైం హెచ్‌సీ జె.నాగరాజు, కానిస్టేబుల్ ఆర్.లోవరాజు, టీఎస్ దుర్గాప్రసాద్, ఎ.జయరాం, హోంగార్డు ప్రసాద్, గిరిలను ఎస్పీ అభినందించారు. విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుల్ లోవరాజును పరామర్శించారు. లోవరాజు భార్య, కుటుంబ సభ్యులకు ఎస్పీ ధైర్యం చెప్పి వైద్యానికి అయ్యే ఖర్చు అంతా పోలీస్ శాఖ భరిస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు.



జగ్గంపేటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కళాశాలకు బయలుదేరి.. అంతలోనే కన్నుమూసి!

ఆగి ఉన్న కంటెయినర్‌ను బైక్ ఢీకొని విద్యార్థి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



కంటెయినర్‌ను బైక్ ఢీకొన్న దృశ్యం



నవనీత్ (ఫైల్)

అనపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద మండపేట-రామచంద్రపురం కెనాల్ రోడ్డులో గురువారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో పెనుగుదురులో నిమ్స్ కళాశాలలో ఫిజియోథెరపీ విద్యనభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాల పాలయ్యారు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్(22), ద్వారకా తిరుమల మండలం కమరి గ్రామానికి చెందిన మానుకొండ చందు కాకినాడ జిల్లా పెనుగుదురు గ్రామంలోని కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో చదువుకుంటూ అదే కళాశాలలోని హాస్టల్‌లో ఉంటున్నారు. ఇద్దరూ బైక్‌పై కళాశాలకు వెళ్తుండగా పులగుర్త గ్రామం వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖమ్మం నుంచి కాకినాడ వెళ్లే కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొన్నారు. తీవ్ర గాయాలపాలైన ఇద్దరినీ స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే నవనీత్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చందుకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

ప్రక్కిలంకలో విషాదఛాయలు

తాళ్లపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్త వద్ద జరిగిన ప్రమాదంలో ప్రక్కిలంక గ్రామానికి చెందిన పుచ్చకాయల నవనీత్ మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నవనీత్ పెనుగుదురులోని కిమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. నవనీత్ తండ్రి బాల మురళీకృష్ణ ప్రక్కిలంకలోని ఫైడి ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా చేస్తుండగా తల్లి భారతి మండలంలోని గజ్జరం గ్రామంలో సచివాలయ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. సోదరుడు స్నేహిత్ రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో బీఎస్సీ (ఫోరెన్సిక్) ఫైనలియర్ చదువుతున్నాడు. అన్నదమ్ములిద్దరూ కవలలు. నవనీత్ మృతితో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. నవనీత్ తల్లి భారతి రోదనలు మిన్నంటాయి.

హైవేపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా..

బైక్ హ్యాండిల్ లారీకి తగిలి యువకుడి మృతి.. మరో యువకుడికి స్వల్ప గాయాలు



సంఘటనా స్థలంలో మరణించిన భరత్‌చంద్ర

రాజానగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం జరిగి ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా గైట్ కళాశాల సమీపంలో హైవేపై శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మంగం భరత్‌చంద్ర(20), గొల్లపల్లి నాగేంద్ర స్నేహితులు. పెయింటింగ్ పనులు చేస్తుంటారు. కాకినాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భరత్‌చంద్ర బంధువు అయిన కృష్ణబాబుకు సీరియస్‌గా ఉందని సమాచారం రావడంతో గురువారం రాత్రి మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం తిరిగి తొర్రేడు పయనమయ్యారు. మార్గమధ్యలో గైట్ కళాశాల వద్దకు వచ్చే సరికి హైవేపై ముందు వెళ్తున్న లారీని అధిగమిస్తున్న తరుణంలో మోటార్‌సైకిల్ హ్యాండిల్ లారీకి తగలడంతో అదుపుతప్పి బైక్ నడుపుతున్న భరత్‌చంద్ర అదే లారీ కిందపడి పడి అక్కడికక్కడే మరణించాడు. నాగేంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు.

అంగరలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

» లీకేజీని అరికట్టిన అధికారులు, సిబ్బంది » భయాందోళనలో గ్రామస్తులు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో శుక్రవారం ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకైంది. దీంతో గ్రామస్తులు ఏం జరుగుతుందోనని భయాందోళనలు చెందారు. ఓఎన్జీసీ, ఫైర్ అధికారులు, సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో ఓఎన్జీసీ డ్రిల్‌పాయింట్ నుంచి వేరే చోటుకు వెళ్లే పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకైంది. దీంతో దానికి సంబంధించిన 4 ఛానల్స్‌ను మండపేట గ్యాస్ కలెక్టింగ్ స్టేషన్ నుంచి మూసివేశారు. లీకైన గ్యాస్ ప్రెజరు తగ్గించేందుకు ఫైర్ సిబ్బంది వాటర్ స్ప్రే చేయడంతో గ్యాస్ ప్రెజర్ జీరోకు తగ్గిందని మండపేట ఫైర్ ఆఫీసర్ హనుమంతరావు తెలిపారు. అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి లీకేజీని అరికట్టడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అంగరలో ఓఎన్జీసీ పాయింట్ వద్ద గ్యాస్ లీకేజీ ఏర్పడినట్టు తెలియడంతో ఆ ప్రాంతాన్ని అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరిశీలించారు. సంఘటనకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై సైట్ ఇన్‌చార్జ్ సుబ్బారావును వివరణ అడగ్గా అడుగున ఉన్న పైప్‌లైన్ శుభ్రం చేస్తుండగా యుబెండ్ జాయింట్ వద్ద ప్రెజర్‌కు గ్యాస్ లీకై బయటకు వచ్చిందని, వెంటనే దాన్ని బంద్ చేశామన్నారు. కానీ ఆపైప్‌లోని గ్యాస్ కొంత బయటకు వచ్చిందని తెలిపారు. దీనిపై రిస్క్ ఏమైనా ఉంటుందా అని అడగగా ఎలాంటి రిస్క్ ఉండదని, టెక్నిషియన్స్ పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుందన్నారు. దీనిపై గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తుండగా రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీ, జిల్లా కలెక్టర్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహశీల్దార్ పి.చిన్నారావు, మండపేట సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, ఈవోపీఆర్డీ మోహన్,సర్పంచ్ కోటేశ్వరరావు పరిశీలించారు.

నేడు గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్

కడియం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రౌండ్‌లో శనివారం జరిగే గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హైదరాబాదుకు చెందిన ఈవెంట్ నిర్వాహకులు వేదికను సిద్ధం చేస్తున్నారు. సభా వేదిక వద్ద ట్రాఫిక్ విధానాలను పరిశీలించడానికి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, ఏఎస్పీలు ఏబీఎస్ మురళీకృష్ణ, సుబ్బరాజు, డీఎస్పీలు భవ్యకిషోర్, దేవకుమార్, రమేష్, పలు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. లక్ష మంది పైగా మెగా అభిమానులు ఈ ఈవెంట్‌ను తిలకించడానికి వస్తారని అంచనా. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, దర్శకులు శంకర్, సినిమా యూనిట్ ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఆలిండియా చిరంజీవి ఫాన్స్ అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, చిరంజీవి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ, మెగా అభిమానులు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.



ఈవెంట్‌కు సిద్ధం అవుతున్న వేదిక

రీసర్వే గ్రామసభ ఫిర్యాదులపై సమీక్ష

పెద్దాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రీసర్వే గ్రామసభలో అందిన ఫిర్యాదులు, సర్వే సంబంధిత సమస్యలు, రాబోయే రీసర్వే కార్యకలాపాలు, ఫిజికల్ సైట్లు తదితర అంశాలపై ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి సర్వే అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తహశీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ మధుసూదన్

పిఠాపురం రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ సూచించారు. పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో జిల్లాపరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిలతో కలిసి శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పల్లె పండుగలో మంజూరైన పనులు, వాటి పురోగతి, పనుల నాణ్యత తదితర అంశాలను ఆరా తీశారు. ఉపాధిహామీ పథకం పనులు, గోకులం షెడ్లు నిర్మాణం, ఎఫ్‌కేపాలెంలో ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టు పరిస్థితి తదితర అంశాలపై చర్చించి సూచనలు ఇచ్చారు. పనులు నాణ్యతతో జరగాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఇంజనీరింగ్, ఉపాధి అధికారులున్నారు.


పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

గొల్లప్రోలులో పర్యటన

గొల్లప్రోలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల అవసరాలకు సరిపడా పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ అధికారులను ఆదేశించారు. ఆయన గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. తాటిపర్తి బోర్లు నుంచి గొల్లప్రోలు రక్షిత మంచినీటి పథకానికి వచ్చే పైపులైన్ల మార్పు, ఇతర మరమ్మతుల కోసం రూ.72లక్షలతో చేపట్టిన పనులను పురోగతిని పరిశీలించారు. రక్షిత తాగునీటి పథకం పంప్ హౌస్, తాటిపర్తిలో బోర్లు పరిశీలించి పనితీరుపై ఆరా తీశారు. సూర్యుడు మంచినీటి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ పనులు మధ్యలో నిలిచి పోవడంపై పరిశీలన చేశారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామనే ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయానికి చేపట్టిన పనులు మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని సూచించారు. ఆయన వెంట పబ్లిక్‌హెల్త్ డీఈ గంగరాజు, ఏఈ ప్రభాకర్, తహశీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కర్రి స్వప్న తదితరులున్నారు.

గిడ్డంగుల సంస్థ గోదాములను ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

సామర్లకోట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో పది వేల మెట్రిక్ టన్నుల పరిమాణంతో నిర్మించిన గోదాములను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా శుక్రవారం సాయంత్రం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా గిడ్డంగుల సంస్థ మేనేజరు కార్యాలయ భవనాన్ని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి కాసేపు వీల్‌ఛైర్‌లో ఆశీనులయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, కుడా ఛైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్, ఏడీ రత్నప్రశాంతి, పశుసంవర్ధక జేడీ డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, డీడీ డాక్టర్ అంబేద్కర్, ఏడీ డాక్టర్ ప్రమీల, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వల్లూరి సూర్యప్రకాశరావు(సూరిబాబు), టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు పాల్గొన్నారు. అనంతరం గిడ్డంగుల ఆవరణలో మంత్రి రాజప్పతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. అచ్చెన్నాయుడిని రాజప్ప ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు వితరణ


ఫ్యాన్లు బహూకరిస్తున్న దృశ్యం

కరప, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కరప మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాలకు కాకినాడ రోటరీక్లబ్ 15 ఫ్యాన్లను వితరణ చేసింది. గురుకుల పాఠశాల విద్యార్థుల సౌలభ్యం కోసం గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు వినతి మేరకు రోటరీ క్లబ్ సభ్యులు అరిగెల వెంకటేశ్వరరావు(పెదబాబి), కళ్యాణ్ చక్రవర్తిలు హెచ్ఎం కేవీ రామకృష్ణారావుకు ఈ ఫ్యాన్లను అందజేశారు. ఉపాధ్యాయులు పేపకాయల వీర్రాజు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారు పోలవరం, పుష్కర కాలువ గట్లు నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లు సీతంపేట గ్రామానికి చెందిన ముత్తిన రాజేష్, దుర్గాడ గ్రామానికి చెందిన విప్పర్తి ఆనందబాబును అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చేసిన సేవలతో గుర్తింపు

కరప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలే సమాజంలో గుర్తింపు నిస్తాయని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ ప్రభాకరరావు పేర్కొన్నారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో జరిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) ఎడ్ల రత్నకుమారి ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. రత్నకుమారి వివాదాలకు తావు లేకుండా వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేశారని కొనియాడి ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, కరప పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఏంజెలినా, హెల్త్ సూపర్‌వైజర్లు గోపీ, సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.


సీహెచ్‌వో రత్నకుమారికి సన్మాన దృశ్యం

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సంధ్యారాణిని అభినందిస్తున్న దృశ్యం

కరప, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు కరప మండలం పెద్దాపురప్పాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.సంధ్యారాణి ఎంపికైంది. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆమె గత నవంబరులో జరిగిన 68వ అంతర జిల్లాల సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలికల పోటీల్లో మంచి ప్రతిభ కనబరచడంతో తూర్పుగోదావరిజిల్లా జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఆమె ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు ఈనెల 5వ నుంచి మహారాష్ట్రలోని జలగంలో నిర్వహించే 68వ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికచేసినట్టు పాఠశాల పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సంధ్యారాణిని, తర్ఫీదునిచ్చిన పీడీ ప్రసాద్‌లను ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, హెచ్ఎం ఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్‌సీసీ ఉపాధ్యాయుడు తెలగాని వెంకట్రావు, సర్పంచ్ బిరుదా సరస్వతిఅప్పారావు, ఎస్ఎంసీ ఛైర్మన్ యాళ్ల నాగమణి తదితరులుఅభినందించారు.

'సకాలంలో రుణాలు మంజూరు చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): వివిధ పథకాల్లో అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని డీసీసీ, డీఎల్ఆర్సీ కమిటీ నిర్ణయించింది. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా లీడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో డీసీసీ, డీఎల్ఆర్సీ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ, కౌలురైతులు, పీఎంఈజీపీ, విశ్వకర్మ యోజన పథకాల్లో లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో సంప్రదాయ కుల వృత్తిదారుల హస్తకళాకారులు తమ వ్యాపారాన్ని మరింతగా బలోపేతం చేయడానికి కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రబీలో వ్యవసాయ పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలుగా రుణాలు ఇవ్వాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 26,916 సంఘాలకు రుణాలుగా రూ.1729కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 11558 సంఘాలకు రూ.759కోట్లు ఇచ్చారన్నారు. మిగిలిన సంఘాలకు కూడా రుణాలు వేగవంతంగా ఇవ్వాలన్నారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ ప్రసాద్, నాబార్డు ఏజీఎం సోమునాయుడు, పరిశ్రమల జీఎం గణపతి, పూర్ణిమ, సాయిమనోహర్, ప్రియంవద, నరసింహరావు, పెద్దిరాజు ఉన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

'వందేభారత్'కు సామర్లకోటలో హాల్ట్ కల్పించాలి

కేంద్ర రైల్వే మంత్రిని కోరిన కాకినాడ ఎంపీ

కలెక్టరేట్(కాకినాడ),జనవరి 3(ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభం కానున్న విశాఖ-తిరుపతి నగరాల మధ్య నడిచే వందేభారత్ రైలుకు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ కల్పించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. ఈమేరకు ఆయన శుక్రవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతికి నిత్యం వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తున్న దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న రైళ్లకు అదనంగా అత్యాధునిక సౌకర్యాలతో విశాఖ-తిరుపతి వందే భారత్ రైలు నడపాలని గతంలో కూటమి ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి చేశారని పేర్కొన్నారు. త్వరలో ఈ రైలు నడిపేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నందున కాకినాడ జిల్లా ప్రజలకు ఉపయోగపడేవిధంగా హాల్ట్ కల్పించాలని కోరామన్నారు. త్వరలో ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రిని స్వయంగా కలుస్తామని పేర్కొన్నారు.

9న మెగా జాబ్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ గవర్నమెంట్ ఐటీఐలో ఈ నెల 9న మెగా జాబ్, అప్రంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాకు హాజరవుతాయన్నారు. డీ సివిల్ చేసి ఎన్టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో గవర్నమెంట్ ఐటీఐలో జరుగుతున్న జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. వివరాలకు 8639230775 నెంబరును సంప్రదించాలని కోరారు.

బంగారు పుష్పాలతో అర్చన

పెద్దాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం ప్రత్యేక అర్చన కార్యక్రమం నిర్వహించారు.

పిఠాపురంలో విజిలెన్స్ తనిఖీలు

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పురపాలక సంఘం పరిధిలో వివిధ గ్రాంట్లు ద్వారా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, నాణ్యత సరిగా లేదని అందిన ఫిర్యాదులపై ఇప్పటికే విచారణ నిర్వహించిన విజిలెన్స్ అధికారులు మరోమారు పరిశీలన చేపట్టారు. గతంతో కొలతలు తీసుకున్న అధికారులు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని విద్యుత్‌నగర్, తారకరామనగర్, చిట్టోడితోట, జగ్గయ్యచెరువు కాలనీ సహా పలు ప్రాంతాల్లో నిర్మించిన 7రోడ్లు, ఒక డ్రెయిన్ నాణ్యతను తనిఖీ చేశారు. రోడ్లను తవ్వి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్టు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఈఈ మధుసూదన్, ఏఈ సుబ్రహ్మణ్యం, పబ్లిక్‌హెల్త్ పూర్వ డీఈఈ హుస్సేన్, మునిసిపల్ డీఈఈ భవానీశంకర్, పూర్వ ఏఈ వంశీ అభిషేక్ తదితరులు ఉన్నారు.

మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే కృషి

జేఎన్టీయూకే వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే ఎంతో కృషి చేశారని కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సావిత్రీబాయిపూలే 194వజయంతి సందర్భంగా వర్సిటీ ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాలకు వీసీ పూలమాలవేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ పూలే నుంచి ప్రస్తుత సమాజంలోని మహిళలు ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ, ఎం.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.


కాకినాడ: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ మురళీకృష్ణ తదితరులు

సావిత్రీబాయి పూలే జయంతి

పెద్దాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సావిత్రీ బాయిపూలే అంటే మహిళా చైతన్యమని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా టీఎల్ పద్మ, సావిత్రి, చంటమ్మ, సత్యవేణి పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను చాటిచెప్పారు

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మహిళా విద్య ప్రాధాన్యతను చాటిచెప్పిన ఘనత సావిత్రిబాయి పూలేకు దక్కుతుందని, బడుగు, బలహీన వర్గాలకు పూలే దంపతులు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. పిఠాపురం పట్టణంలోని నండూరి ప్రసాదరావు భవనంలో శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నాయకురాలు కె.మణి, సీఐటీ యూ నాయకుడు కుంచే చిన్నా, రజకవృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు, నాగేశ్వరరావు, వీరబాబు, మణికంఠ, అరుణకుమారి, నాగు, సూర్యనారాయణ, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పూలే చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా లెక్చరర్లను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా


సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వ భరోసా ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణం 4వ వార్డుకు చెందిన చింతపల్లి దుర్గాప్రసాద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.92,858 చెక్కును శుక్రవారం వర్మ అందజేశారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దకొడుకుగా ఆదుకుంటారని తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలల పట్ల వివక్ష తగదు : సీడీపీవో



మాట్లాడుతున్న సీడీపీవో ఉషా

సామర్లకోట, జనవరి3(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కిశోరి వికాసం పేరిట నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల ద్వారా సమాజంలో అందరినీ చైతన్యవంతులను చేయాలని పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో ఐ.ఉషా పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశపు హాల్‌లో మండల స్థాయిలో ఐసీడీఎస్, మండల విద్యాశాఖ సిబ్బంది, మండల డ్వాక్రా గ్రూపు సభ్యులతో కిశోరి వికాసం పేరిట అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్ర రూపం దాల్చిందని, బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు. చిన్నారులు, యువతుల అక్రమ రవాణా తదితర అంశాలపై సీడీపీవో ఉషా వివరించారు. సదస్సులో ఎంఈవో వై.శివరామకృష్ణయ్య, మెడికల్ అధికారి హిమవతి, ఎస్.పరదేశ్, సీహెచ్.స్వర్ణలత, డ్వాక్రా ఏపీఎం జగదీశ్వరి, ఏవో సతీష్, కె.శ్రీనివాసరావు, జంగం సంతోషకుమారి ప్రసంగించారు. నాలుగు శాఖలకు చెందిన మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై హెచ్ఎంలకు అవగాహన

కొత్తపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కొత్తపల్లిలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. 2012 బాలలపై లైంగిక హింస పరిరక్షణ చట్టం(పోక్సో)పై ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో-1 బుర్రా వేణుగోపాల్ అవగాహన కల్పించారు. పిల్లలపై ఎవరైనా లైంగిక దాడికి పాల్పడితే హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు కాల్ చేసి సాయం పొందవచ్చన్నారు. ఈవిషయంపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీవో రవికుమార్, ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తే ఎలా?

పిఠాపురంలో మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ నిరసన దీక్ష

పిఠాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వాలే లిక్కర్ అమ్మకాలను ప్రోత్సహించే విధంగా వ్యవహరించడంపై నిరసన వ్యక్తం చేస్తూ పిఠాపురం తహశీల్దారు కార్యాలయం వద్ద మద్యపాన వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. సమితి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన దీక్షలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పలు ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. నూతన సంవత్సరం వేళ రూ.200కోట్లు మద్యం అమ్మ కాలు జరిగినట్లు ఘనంగా ప్రకటించుకోవడం విచారకరమని నాయకులు అన్నారు. మద్యాన్ని ఆదాయవనరుగా చూడటం విచారకరమని తెలిపారు. మద్యం, మాదకద్రవ్యాల మత్తులో యువత పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ పీఎస్ రాజు, పౌరసంక్షేమ సంఘం ఛైర్మన్ దూసర్లపూడి రమణరాజు, పిఠాపురం రాజా రావు రామరత్నారావు, సమితి, ప్రజాసంఘాల నాయకులు కొమ్ము చినబాబు, వేమగిరి తలుపుల య్య, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, ఎం. అ మృత, గుబ్బల రాజు, సతీష్, పావని, వేమగిరి రమేష్, మరిడయ్య, ఏసమ్మ, నాని పాల్గొన్నారు.

తిమ్మాపురంలో పంట కాలువ ఆక్రమణలు


అచ్చంపేట సెంటర్‌లో పంట కాలువపై అక్రమ నిర్మాణాల దృశ్యం

సర్పవరం జంక్షన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్, సిటీకి ఆనుకుని ఉన్న భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రభుత్వ, పోరంబోకు, పంట కాలువలను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. దాంతో వర్షాలు, వరదలు సమయంలో నీరు బయటకెళ్లే మార్గం లేక పలు కాలనీలు వరద ముంపులో చిక్కుకుంటున్నాయి. కాకినాడ రూరల్ తిమ్మాపురం, అచ్చంపేట సెంటర్ సమీపంలో పీబీసీ కాలువ ఆక్రమించి పలు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. పీబీసీ సెక్షన్ పంట కాలువ అర కిలోమీటరు మేర 32 లింకులతో 22అడుగుల పంట కాలువ ఉండగా, రియల్టర్లు ఈపంట కాలువను ఆక్రమించేసి పలు భవనాలు నిర్మించారు. పంట కాలువకు చేర్చి ఉన్న ఇతర ప్లాట్ల యాజమానులు దర్జాగా పంట కాలువను ఆక్రమించేసి యర్ర గ్రావెల్‌తో కప్పేసి, భవనాలు, షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే పంట కాలువ ఆక్రమణకు గురికావడంతో వర్షం, వరద నీటితో అవంతినగర్, మారుతీనగర్ ముంపు బారిన పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ శివకృష్ణకు ఫిర్యాదు చేశారు. పంట కాలువపై ఆక్రమణలను పరిశీలించి నివేదిక అందజేయాలని లస్కర్ రెడ్డిని ఏఈ ఆదేశించారు. పంటకాలువల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ..బాలికకు అభినందన


బాలికను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ అర్బన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ సాధించిన ఆశ్రమ పబ్లిక్ స్కూల్ మూడో తరగతి చదువుతున్న ఆకుల కావ్యశ్రీని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శుక్రవారం ఆయన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో జరిగిన జాతీయస్థాయి రోలర్ స్కేటిగ్ పోటీల్లో కావ్యశ్రీ రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించి ద్వితీయస్థానంలో నిలిచింది. మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్న కావ్యశ్రీ తండ్రి సత్తిబాబును కూడా ఎమ్మెల్యే అభినందించారు. పిల్లలను క్రీడల్లో సత్తా చాటేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఆర్ఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజగోపాల్, దొరస్వామి, ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆగస్టీన్, శిక్షకుడు ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడిపి పట్టుబడిన 14మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు శుక్రవారం తీర్పుచెప్పారు. కాకినాడట్రాఫిక్ సీఐలు, ఎన్.రమేష్ డి.రామారావు బృందాలతో గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదుకుమించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14మంది పట్టుబడ్డారు. ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, 8మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

10 లీటర్ల సారా స్వాధీనం

సర్పవరం జంక్షన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం నేమాం శివారు గుత్తులవారిపాలెంలో దాడులు నిర్వహించి 10లీటర్ల సారాను ఎక్సైజ్‌శాఖ అధికారులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కాకినాడ నార్త్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, హెచ్‌సీ వి.వెంకటేశ్వర్లు సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు చేయగా సారా విక్రయిస్తున్న కొప్పిశెట్టి వెంకటలక్ష్మిని అరెస్ట్ చేసి, ఆమె నుంచి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు నార్త్ స్టేషన్ సీఐ కె.రామమోహనరావు తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట వలంటీర్ల నిరసన దీక్షలు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు వలంటీర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నుంచి నిరసన దీక్షలు ప్రారంభించారు. టీడీపీ మేనిఫెస్టో ప్రకారం రూ.10వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలంటీర్లను రెన్యువల్ చేస్తూ ఆదేశాలు ఇవ్వాలన్నారు. వారికి సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబిరాణి నిమ్మరసం ఇచ్చి తొలిరోజు దీక్ష విరమింపజేశారుయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నగేష్, చిట్టితల్లి, ఆశ, ప్రశాంతి, రామయమ్మ పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదాలు ఆడవద్దు : ఎస్ఐ

కొత్తపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదాలు ఆడరాదని, సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఎస్ఐ జి వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా కొమరగిరిలో శుక్రవారం క్రికెట్‌టోర్నమెంట్‌ను సీఐ శ్రీనివాస్ ప్రారంభించారు. కోడిపందేలు, జూదాలు ఆడితే చర్యలు తప్పవన్నారు.

'గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

ప్రత్తిపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గోపాలమిత్రలు పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును కోరారు. మండలంలోని గోపాలమిత్రలు శుక్రవారం సామర్లకోట తరలివెళ్లి మంత్రికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాను కూడా కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిరీషదేవి

వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే జైలుకు వెళ్లే రోజులు వస్తున్నాయి

రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి దంపతులు

రంపచోడవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతఉదయ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి జైలుకు వెళ్లే రోజులు వస్తున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఆమె భర్త, తెలుగు యువత నాయకుడు విజయబాస్కర్ అన్నారు. రంపచోడవరంలో శుక్రవారం వారు మాట్లాడారు. ఇటీవలి కాలంలో తనపై వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే సాగిస్తున్న అసత్య ఆరోపణలను విజయభాస్కర్ ఖండించారు. తమకు వైసీపీ నేతల్లా ఎటువంటి నేర చరిత్రా లేదని, వారు సాగించిన అక్రమాలకు వారే మూల్యం చెల్లించుకునే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. ఇక్కడ టీడీపీ విజయాన్ని చూసి వైసీపీ నేతలకు మతి చలించి మాట్లాడుతున్నారన్నారు. అడ్డతీగల మండలంలోని మూడు పంచాయతీల నుంచి 250 కుటుంబాల వారు వైసీపీని వీడి ఎమ్మెల్యే శిరీషదేవి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. పేదల పక్షపాతిగా టీడీపీ వైపు అందరూ చూస్తున్నారని, అందులో భాగంగానే వైసీపీని వీడి తమవైపు వస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

రంపచోడవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. స్థానిక ఆర్‌పీ రెసిడెన్సీలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించి సుదీర్ఘకాలలంగా పెండింగులో ఉన్న బిల్లుల మంజూరుకు చర్యలు చేపట్టారన్నారు. దేవీపట్నం మండలంలో 567 నిర్వాసిత కుటుంబాలకు రూ.3745.86 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

మన్యంలో సావిత్రి బాయి పూలేకు నివాళి

రాజవొమ్మంగి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతిని యూటీఎఫ్ మహిళా అధ్యక్షురాలు కోడూరి లోవరాజు అధ్యక్షతన కార్యదర్శి టీవీఎల్ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కౌన్సిలర్ వెంకటలక్ష్మి అతిథిగా హాజరయ్యారు. వారంతా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కారం రాం బాబు, అధ్యక్షుడు పీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను, జిల్లా కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, తీగల బొజ్జియ్య, చోడి రాధ, సత్యబాబు, మిరియాల సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ పాఠశాల ఆవరణలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుడు దంగేటి సత్తిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు వెంకటరత్నం, మహిళా ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి జరిపారు. ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రి బాయి సేవలు, రచనలు, ఆమె ఆదర్శ జీవితాన్ని విద్యార్థులకు వివరించారు.



వై.రామవరంలో...



అడ్డతీగలలో...

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

మోతుగూడెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు గతంలో ఆంధ్రా బ్యాంకు వెనుక స్థలాన్ని కేటాయించారు. శుక్రవారం దానిని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశాలతో చింతూరు తహసీల్దారు ఎస్.చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. ఈ స్థలం జెన్‌కో పరిధిలో ఉన్నందున లోయర్ సీలేరు ప్లాంట్ మేనేజరు భీమవరపు బాలకృష్ణ కూడా పరిశీలించారు. తమ ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయాన్ని తహసీల్దారుకు తెలియజేస్తామన్నారు. పరిశీలనలో మోతుగూడెం పంచాయతీ సెక్రటరీ జి.మోహన్, సర్వేయర్, వీఆర్వోలు, జెన్‌కో సివిల్ ఏఈ విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మొండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు చిరంజీవి



గండిపోశమ్మ తల్లికి పంచామృతాభిషేకం

దేవీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో వెలసిన శ్రీగండిపోశమ్మ తల్లికి శుక్రవారం 101 బిందెలతో గోదావరి జలాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి రూ.5వేలు సాయం

మోతుగూడెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడికి చెందిన బర్రి రాజు (25) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికుల సలహా మేరకు శుక్రవారం మృతుడి భార్యకు జేకేసీ ట్రస్టు ద్వారా రూ.5వేలు అందించారు. ట్రస్టు సభ్యులు షేక్ రియాజ్, రామారావు, గణేష్, సుకుమామిడి గ్రామస్తులు పాల్గొన్నారు.



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



అన్నవరం జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్, అధ్యాపకులు, విద్యార్థినులు



జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



తొండంగి మండలం పెరుమాళ్లపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

జగ్గంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ రంగారావు ఏర్పాటుచేసిన సావిత్రిబాయి పూలే విగ్రహా విష్కరణ ఆర్పీఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ భారత దేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యా యురాలు అయిన సావిత్రిబాయి మహిళలకు విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సూరిబాబు, ఫిజియోథెరపీ డాక్టర్ శ్రీరామ్, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఎస్‌ఏ గఫూర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరు నాని, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వియ్యపు అప్పలస్వామి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంచికాట్ల రామకృష్ణ, టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.కృష్ణమోహన్ పాల్గొన్నారు. అనంతరం ఎంపీ యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఇజ్జిన మల్లి ఏర్పాటుచేసిన సావిత్రి బాయి పూలే లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులను మహిళా ఉపాధ్యాయులకు అందజేశారు.

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రి బాయి చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు నివాళులర్పించారు. మహిళా సాధికారిత విభాగం కన్వీనర్, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు గోపాలకృష్ణ, వారణాసి మల్లికార్జునశర్మ, అకడమిక్ కో-ఆర్డినేటర్ విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఘంటశాల వెంకట్ కోరారు. ఆమె ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు భద్రరావు, సూరిబాబు, ఎస్వీ ప్రసాద్, మాణిక్యాంబ, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అపర్ణ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ పాఠశాలలో పనిచేస్తున్న తొమ్మిది మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, బద్ది లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ సునీత పూలమాల వేసి నివాళులర్పించారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా, చదువు కోసం, మహిళల అభ్యున్నతికి ఆమె ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.



అన్నప్రసాదంలో దర్శనమిస్తున్న శ్రీనివాసుడు


అన్నకూటోత్సవం

తుని రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అన్నకూటోత్సవం నిర్వహించారు. 150 కిలోల పులిహోరతో వెంకటేశ్వరస్వామి రూపాన్ని తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అన్నప్రసాద వితరణ చేసింది.



అంతర్జాతీయ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో మౌనేష్ ప్రతిభ

గండేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీకి చెందిన ఐఎంసీఏ (ప్రథమ సంవత్సరం) విద్యార్థి బి.మౌనేష్ సీనియర్ ఇంటర్నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు. తన జట్టు రన్నరప్‌గా నిలవడంలో విశేష కృషి చేశాడని ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మౌనేష్‌ను ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



'అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి'

ఎటపాక, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన శ్రీరాంనగర్ కాలనీ (దమ్మక్కగూడెం)లోని సూత్రు వెంకటలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకుడు సాయన్న కోరారు. శుక్రవారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.3 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని, పరిహారంతో పాటు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసింహారావు, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ఎస్ఎంసీ కమిటీలకు శిక్షణ

ఏలేశ్వరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు ముఖ్య పాత్ర వహించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ బుజ్జి, ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంఈవో బి.అబ్బాయి అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బుజ్జి మాట్లాడతూ ఉపాధ్యాయుల పనితీరు, విద్యా బోధన, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల తనిఖీ, అభివృద్ధి అంశాలపై కమిటీలు దృష్టి పెట్టాలన్నారు. సీఆర్పీ సత్యనారాయణ, ఎస్ఎంసీల చైర్మన్లు కర్రోతు గాంధీ, పసుపులేటి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కటకం సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

క్రీడలతో మానసికోల్లాసం: ఎస్పీ

జగ్గంపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా జగ్గంపేటలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఎస్పీ విక్రాంత్ పాటిల్ కబడ్డీ, వాలీబాల్ పోటీలను తిలకించి క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పలువురు క్రీడాకారులను అభినందించారు. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్కే. శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునందనరావు, కిర్లంపూడి, గండేపల్లి ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కబడ్డీ బాలురు సీనియర్స్ విభాగంలో ఎనిమిది జట్లు తలపడగా మల్లిశాల జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ నెల ఏడో తేదీన ఫైనల్ మ్యాచ్‌లో మల్లిశాల జగ్గంపేటతో తలపడుతుంది. వాలీబాల్ బాలురు జూనియర్ విభాగంలో 21 జట్లు ఆడాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, గండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ, రాజపూడి జడ్పీ ఉన్నత పాఠశాల తృతీయ స్థానాల్లో నిలిచాయి.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

'మత్స్యకారుల డిమాండ్లు నెరవేర్చాలి'

తొండంగి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని తీర ప్రాంత మత్స్యకారులు దివీస్ యాజమాన్యానికి వినతిపత్రం అందించారు. శుక్రవారం కొత్తపాకలు సమీపంలోని ఫ్యాక్టరీ గేటు వద్ద మత్స్యకార నాయకులు కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, మహంకాళి, చొక్కా కాశీశ్వరావు, ఒంటిమామిడి సర్పంచ్ అంగులూరి అరుణకుమార్, జి.లక్ష్మణరావు, సూరాడ రాంబాబు తదితరులు దివీస్ ప్రతినిధి వాసుబాబును కలిశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో తాము జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నందున నెలనెలా రూ.15వేలు ఇవ్వాలని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ శాశ్వత ఉద్యోగం కల్పించాలని, రూ.10లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

పాండవులపాలెంలో లిబరేషన్ ప్రదర్శన

ప్రత్తిపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం పాండవులపాలెం గ్రామంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, సత్యనారాయణ, చిన సత్యనారాయణ, కె.వీరబాబు, ఎస్.శ్రీను, వెంకట సత్తిబాబు, ఉమాదేవి, మరిడమ్మ, వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.13 లక్షలు పరిహారం

ఏలేశ్వరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరం అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ కర్మాగారంలో పనిచేస్తున్న జామి మహాలక్ష్మి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బాధిత కుటుంబ సభ్యులతోను, పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడారు. మృతురాలి భర్త గోవింద్‌కు పరిశ్రమలో ఉద్యోగం, రూ.13 లక్షలు పరిహారం, కుమార్తెల చదువుకు నెలకు రూ.6 వేలు చొప్పున ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించిందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. బస్వా ప్రసాద్, మైరాల కనకారావు, నూకతాటి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం

అన్నవరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వనదుర్గ ఆలయంలో అర్చకుడు కోట వంశీ ఆధ్వర్యంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. మూల నక్షత్రం సందర్భంగా కొండ దిగువున కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు.

డయాలిసిస్ రోగులకు పింఛను అందజేత

కోటనందూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డయాలిసిస్ రోగులకు రూ.10వేలు చొప్పున పింఛన్‌ను టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు, పంపనబోయిన శివన్నారాయణ, లగుడు సత్యనారాయణమూర్తి, పంపనబోయిన లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలేనికి చెందిన బీసీవై పార్టీ కాకినాడ పార్లమెంటరీ నాయకురాలు అనూషయాదవ్ 2025 క్యాలెండర్లను తయారు చేయించారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్లను బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, సినీ నటి, సంఘ సేవకురాలు రేణుదేశాయ్ ఆవిష్కరించారు. నాయకులు పాల రమేష్, హరిబాబు, సత్తిలి రాజు, యాంకర్లు రవి, భాను పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఐ (ఎంఎల్) కార్యకర్తలు

మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

రౌతులపూడి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జల్దాం గ్రామంలో గిరిజనులు భూములను కబ్జా చేస్తున్న మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం రౌతులపూడి తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ (ఎంఎల్) కార్యకర్తలు ఆందోళన చేశారు. సర్వే నెం.12-2లో 0.82 సెంట్ల భూమిని ప్రభుత్వం ఆమూరి చంద్రారెడ్డికి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వగా అందులోంచి మైనింగ్ తరలించేందుకు రహదారి వేస్తున్నారన్నారు. ఆ భూమిలోంచి రహదారి వేయవద్దని అడ్డుకోగా పోలీసులను తీసుకొచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బలరామపురం గ్రామానికి చెందిన మౌళి అనే వ్యక్తి రైతు చంద్రారెడ్డిని భయపెడుతున్నాడన్నారు. శ్మశానం భూములను ఆక్రమించుకుని రహదారి నిర్మిస్తున్నారన్నారు. తక్షణం స్పందించి మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఎస్ఐలను కోరారు. ఆందోళనలో మండల కార్యదర్శి సామిరెడ్డి నారాయణమూర్తి, ఆమూరి చంద్రారెడ్డి పాల్గొన్నారు.